# చరిత్రలో బలమైన ప్రతిపక్షం బీఆర్ఎస్

- ఉద్యమద్రోహి చరిత్ర ముఖ్యమంత్రిది
- కాంగ్రెస్ రాకతోనే కష్టాలు.. ప్రజలకు ఇప్పుడే తెలుస్తున్నది
- ఎమ్మెల్సీ, కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్ ఆగ్రహం
- బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కార్యకర్తల సమావేశం

బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 9: చరిత్రలో ఎన్నడూలేని విధంగా 39 స్థానాల్లో గెలిచి బలమైన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ నిలిచిందని ఎమ్మెల్సీ, కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ రావడం అంటే.. కష్టాలు రావడమని ప్రజలకు ఇప్పుడే తెలుస్తున్నదని ఆయన పేర్కొన్నారు. హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. సోనియాగాంధీ దయతో తెలంగాణ ఇచ్చింది అని గవర్నర్ అనడం సరైంది కాదని, తెలంగాణ ఎవరి దయతో వచ్చింది కాదని ఆయన పేర్కొన్నారు. ఉద్యమ నేత కేసీఆర్‌కు చాలా చిన్న చాంబర్ విడివిడిగా రెండు రూంలు కేటాయించడంపై అభ్యంతరం తెలిపారు. ఇది కాంగ్రెస్ సంస్కారానికి నిదర్శనమని విమర్శించారు. ఓయూ విద్యార్థులను అరెస్టు చేయడం.. అసెంబ్లీ ముందు ఇనుప కంచెలు విస్తరించడం, వ్యవసాయ యూనివర్సిటీ భూముల విషయంలో విద్యార్థుల జుట్టు పట్టిలాగడం, ఇది కాంగ్రెస్ ప్రజాపాలన శాంపిల్ మాత్రమేనని అన్నారు. రాబోయే రోజుల్లో విశ్వరూపం చూపిస్తారని, మరో పోరాటానికి సమయం ఆసన్నమైందని చెప్పారు. బీఆర్ఎస్ ఫీనిక్స్ పక్షిలాంటిదని, తిరిగి కొత్త ఆలోచనలు, రెట్టింపు శక్తితో మళ్లీ వస్తుందని తెలిపారు. ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మోదీతో మాట్లాడి ఇద్దరం కలిసి పనిచేద్దామని, బీఆర్ఎస్ లేకుండా చేయడమే పనిగా పెట్టుకున్నట్టు విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ జెండాల కంటే తెలుగుదేశం పార్టీ జెండాలే ఎక్కువగా ఉన్నాయని, కొమ్మలు, రెమ్మలు తెలంగాణలో ఉన్నా వేర్లు మాత్రం ఆంధ్రాలో ఉన్నాయని ఎద్దేవా చేశారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం అభినందనీయమని అన్నారు.

### కేసులు బనాయించడం మానుకోవాలి

కాంగ్రెస్ నాయకులు కక్ష సాధింపు చర్యలు.. తప్పుడు కేసులు బనాయించడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. తమ నాయకులు, కార్యకర్తలను వేధిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు బొంగు అశోక్‌యాదవ్, చెన్నం మధు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# నల్లగొండ సభకు భారీ ఏర్పాట్లు

- సభా స్థలంలో చదును పనులు పూర్తి
- నేటి నుంచి వేదిక నిర్మాణంపై దృష్టి
- పర్యవేక్షిస్తున్న బీఆర్ఎస్ నేతలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సన్నాహక సమావేశాలు
- బహిరంగ సభ నిర్వహణకు అనుమతి ఇచ్చిన పోలీస్ శాఖ

చలో నల్లగొండ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, క్రాంతికిరణ్, జాజాల సురేందర్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతను నిరసిస్తూ బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్లగొండ బహిరంగ సభకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 13న నల్లగొండ పట్టణ శివారులోని మర్రిగూడ బైపాస్ వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి రహదారికి అనుకుని ఉన్న 50 ఎకరాల స్థలంలో సభను నిర్వహించనున్నారు. ఇప్పటికే చదును చేసే పనులు పూర్తయ్యాయి. శనివారం నుంచి సభా వేదిక, గ్యాలరీల నిర్మాణం, ఇతర ఏర్పాట్లను ముమ్మరం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన సామగ్రి శనివారం అక్కడికి చేరుకోనున్నది. మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, క్రాంతికిరణ్, జాజాల సురేందర్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ తదితరులు శుక్రవారం సభా స్థలాన్ని పరిశీలించారు. వేదిక నిర్మాణం, గ్యాలరీల ఏర్పాటు, ఇతర పనులపై చర్చించారు. మంగళవారం సభ ఉండటంతో సోమవారం సాయంత్రానికే ఏర్పాట్లన్నీ పూర్తి చేయనున్నట్టు తెలిపారు. సభా వేదికకు నలువైపులా పార్కింగ్ స్థలాలను కూడా పరిశీలించి తగు సూచనలు చేశారు.

### సన్నాహక సమావేశాలు

కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించడం వల్ల జరిగే నష్టం, దాని పర్యవసానాలపై ఏర్పాటుచేస్తున్న ఈ బహిరంగ సభకు విస్తృత ప్రచారం కల్పించేందుకు బీఆర్ఎస్ పార్టీ మొత్తం రంగంలోకి దిగింది. నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా పలు నియోజకవర్గాల్లో మండలాల వారీగా సమావేశాలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గాల వారీగా మాజీ ఎమ్మెల్యేలతోపాటు సభ కోసం నియమించిన పార్టీ సమన్వయకర్తలు సైతం రంగంలోకి దిగారు. చలో నల్లగొండ బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తూనే పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయి వరకు వెళ్లేలా సమాయత్తం చేస్తున్నారు.

### సభకు గ్రీన్‌సిగ్నల్

చలో నల్లగొండ బహిరంగ సభను ప్రకటించగానే నల్లగొండ జిల్లాలో 30,30(ఏ) పోలీస్ యాక్ట్‌ను అమలులోకి తెస్తున్నట్టు చేసిన ప్రకటన కలకలం రేపింది. ఈ నేపథ్యంలో సభకు అనుమతిస్తారా? లేదా? అన్న సందేహాలు నెలకొన్నాయి. ఈ నెల 7న మధ్యాహ్నం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ ఎస్పీ చందనాదీప్తిని కలిసి సభకు అనుమతి కోరుతూ లేఖ అందజేశారు. ఈ నేపథ్యంలో సభకు పలు షరతులతో కూడిన అనుమతి ఇస్తున్నట్టు శుక్రవారం సాయంత్రం పోలీస్ శాఖ ప్రకటించింది. ఈ నెల 13 మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సభకు అనుమతి ఇస్తున్నట్టు నల్లగొండ ఇన్‌చార్జి డీఎస్పీ లక్ష్మీనారాయణ వెల్లడించారు.

### ఇద్దరు రైతుల ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

లచ్చారెడ్డి(ఫైల్)

వెళ్లారు. ఈ క్రమంలో అక్కడే రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. లచ్చారెడ్డికి రూ.నాలుగున్నర లక్షల అప్పు ఉన్నట్టు కుటుంబీకులు తెలిపారు. పోలీ సులు కేసు నమోదు చేసుకొ న్నారు.

### ములుగు జిల్లాలో యువ రైతు

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గూర్రేవులలో యువ రైతు గురువారం రాత్రి తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. మహాముత్తారం మం డలం లెంకలగడ్డకు చెందిన అగ్గు మధుకర్ (32) గూర్రేవులలో ఎకరం లో మిర్చి సాగు చేస్తున్నాడు. దిగుబడి తగ్గడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు.

# రాష్ట్రవ్యాప్తంగా కదంతొక్కిన ఆశ వర్కర్లు

- పెండింగ్ వేతనాలు చెల్లించాలని పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట భారీ ధర్నా

జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/పెద్దపల్లి టౌన్/ఎదులాపురం/నిర్మల్ టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఆశ కార్యకర్తలు కదం తొక్కారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. జీతాలు సక్రమంగా చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ శుక్రవారం జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, ఆదిలాబాద్, నిర్మల్ తదితర కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించారు. అంతకుముందు ప్రధాన కూడళ్ల మీదుగా కలెక్టరేట్ వరకు భారీగా ర్యాలీ తీశారు. ఆయాచోట్ల ఆశ వర్కర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా 2వ తేదీ నాటికి పారితోషికాలు ఆశ కార్యకర్తల ఖాతాల్లో జమ అయ్యేవని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా డబ్బులు జమ కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ అవసరాల కోసం అప్పులు చేసి బతుకుతున్నామని వాపోయారు. పారితోషికం ఇవ్వకపోగా అభయహస్తం, మహాలక్ష్మితోపాటు ఇతర పనులు తమతో కాంగ్రెస్ సర్కార్ చేయిస్తున్నదని మండిపడ్డారు. పీఆర్‌సీ వెంటనే చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.5 లక్షలు చెల్లించాలని, ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

### ఒకటో తేదీన జీతాలివ్వాలి

కాంగ్రెస్ సర్కారు మాపై మోయలేని భారం వేస్తున్నది. రెగ్యులర్ విధులతో పాటు గృహలక్ష్మి, అభయహస్తం అర్హుల వివరాల నమోదు బాధ్యతలు మాకే అప్పజెప్పింది. ఈ భారాన్ని మోయలేక పోతున్నాం. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలి. హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. మా చదువుకు సాధ్యంకాని పనులు అప్పగించొద్దు.

– అణవేన స్వరూప, ఆశ కార్యకర్తల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు

### పనిభారం తగ్గించకపోతే సమ్మెలోకి వెళ్తాం

ప్రజారోగ్యం కోసం పనిచేస్తున్న మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ఫిక్స్‌డ్ సాలరీగా రూ.26 వేలు చెల్లించాలి. సమయానికి జీతాలు అందక ఇల్లు కుటుంబ పోషణ భారంగా మారుతున్నది. పని భారం తగ్గించకపోతే సమ్మెలోకి వెళతాం. – దాసరి విజయ, ఆశ కార్యకర్త, గొల్లపల్లి, పీహెచ్‌సీ సెంటర్.

# పాలమూరులో ఫ్లెక్సీల కలకలం

- సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి పేరుతో ఏర్పాటు
- ఎంపీగా పోటీ చేస్తారంటూ పార్టీలో ఊహాగానాలు
- సీఎంవో ఆదేశాలతోనే ఫ్లెక్సీల తొలగింపు?

మహబూబ్‌నగర్ జిల్లాలోని బైపాస్ రోడ్డు చౌరస్తా వద్ద వెలిసిన తిరుపతిరెడ్డి ఫ్లెక్సీలు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఫ్లెక్సీలు కాంగ్రెస్‌లో కలకలం సృష్టించాయి. శుక్రవారం తెల్లవారుజామున మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో 'తిరుపతన్న మిత్రమండలి' పేరుతో ఫ్లెక్సీలు వెలిశాయి. రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ మినహా షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లో ఈ ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. సీఎం రేవంత్ ఫొటో లేకుండా ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి ఫ్లెక్సీలను రూపొందించడం చర్చనీయాంశంగా మారింది. ఎంపీగా పోటీ చేయాలన్న ఉద్దేశంతో వీటిని తిరుపతిరెడ్డి ఏర్పాటు చేసినట్టు కాంగ్రెస్ నేతలు చర్చించుకుంటున్నారు. ఎంపీ టికెట్ తనకే వస్తుందన్న నమ్మకంతో ఉన్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి పాలమూరు న్యాయయాత్ర పేరిట గత నెల 31 నుంచి పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం సోదరుడి ఫ్లెక్సీలు వెలియడంతో వంశీచంద్ ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. సీఎంవో అధికారులు సంబంధిత మున్సిపాలిటీలకు ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశించినట్టు సమాచారం. దీంతో మున్సిపల్ సిబ్బంది తిరుపతిరెడ్డి ఫ్లెక్సీలను తొలగించారు.

# సోనాలిక సరికొత్త ట్రాక్టర్లు

### 40-75 హెచ్‌పీ సామర్థ్యంతో 10 మాడళ్లు విడుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ట్రాక్టర్ల తయారీలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన సోనాలికా..దేశీయ మార్కెట్లోకి ఒకేసారి పది ట్రాక్టర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. టైగర్ సిరీస్‌లో భాగంగా విడుదల చేసిన ఈ ట్రాక్టర్లు 40 హెచ్‌పీల నుంచి 75 హెచ్‌పీ సామర్థ్యంతో రూపొందించింది. దేశీయ రైతులకు, పరిస్థితులకు తగ్గట్టుగా యూరప్‌లో తయారైన వాటిలో ఐదు అత్యంత శక్తివంతమైన మాడళ్లు కాగా, మరో ఐదు మల్టీ-స్పీడ్ ట్రాన్స్‌మిషన్ మాడళ్లని తెలిపింది. వీటిలో 4,712 సీసీ ఇంజిన్‌తో తయారైన నాలుగు ట్రాక్టర్లు కూడా ఉన్నాయి. 5 హైడ్రాలిక్స్ కలిగిన ఈ ట్రాక్టర్లు 2,000-2,500 కిలోల సరుకును అవలీలగా తీసుకెళ్లనున్నది. వీటి ధర ఏ స్థాయిలో ఉంటుందో మాత్రం సంస్థ వెల్లడించలేదు. దేశీయంగా ట్రాక్టర్ల పరిధిని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో రూపొందించిన పలు మాడళ్లను ప్రవేశపెట్టినట్టు కంపెనీ వైస్ చైర్మన్ అమృత్ సాగర్ మిట్టల్ తెలిపారు.

# అదానీ చేతికి లాంకో విద్యుత్ ప్లాంట్

### రూ.4,101 కోట్లకు ఎన్సీఎల్టీ బిడ్ పొందిన అదానీ పవర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: రుణభారంతో ఎన్సీఎల్టీ దివాలా ప్రక్రియలో ఉన్న లాంకో విద్యుత్ ప్లాంట్ బిడ్‌ను అదానీ గ్రూప్ చేజిక్కించుకుంది. తాజాగా జరిగిన బిడ్ వేలంలో ఈ ప్లాంట్‌ను అదానీ పవర్ రూ.4,101 కోట్లకు దక్కించుకున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. బిడ్స్‌ను సమర్పించిన మరో రెండు సంస్థలు రిలయన్స్ ఇండస్ట్రీస్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)లు వేలంలో పాల్గొనకపోవడంతో అదానీ గ్రూప్‌ను విన్నింగ్ బిడ్డర్‌గా ప్రకటించారు.లాంకో అమర్‌కంటక్ పవర్ కంపెనీ చత్తీస్‌ఘర్‌లో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నది. కంపెనీలా ట్రిబ్యునల్ 2019 సెప్టెంబర్‌లో లాంకో అమర్‌కంటక్ పవర్‌ను దివాలా ప్రక్రియకు స్వీకరించగా, పలు కారణాలతో జాప్యం జరుగుతూ వచ్చింది. 2022లో వేదాంత గ్రూప్ అధినేత అనిల్ అగర్వాల్ రూ.3,000 కోట్లు ఆఫర్ చేసినప్పటికీ, ఈ మొత్తం చాలా తక్కువంటూ రుణదాతలు తిరస్కరించారు.అటుతర్వాత పీఎఫ్‌సీ బిడ్డింగ్‌లో ఇచ్చిన రూ.3,020 కోట్ల ఆఫర్‌ను 95 శాతం మంది రుణదాతలు ఆమోదించినా, ఎన్సీఎల్టీ ఆ ప్రణాళికను ఆమోదించలేదు. అప్పట్లో రిలయన్స్, అదానీలు వేలంలో పాల్గొనలేదు. తాజా వేలంలో లాంకో ప్రాజెక్టును రుణదాతలు నిర్ణయించిన బేస్ ధరకే అదానీ పవర్ సొంతం చేసుకోవడం గమనార్హం.

# ఆర్థిక మోసాలపై ఉక్కుపాదం

### 1.4 లక్షల మొబైల్ నంబర్లు బ్లాక్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఆర్థిక మోసాలను అరికట్టడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 1.4 లక్షల మొబైల్ నంబర్లను బ్లాక్ చేసింది కేంద్ర ప్రభుత్వం. తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషి అధ్యక్షతన శుక్రవారం ఆర్థిక సేవల రంగంపై సైబర్ దాడులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఆర్థిక మోసాలు పాల్పడేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నారని, వీటిని అరికట్టడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్టు, ముఖ్యంగా పోలీసులు, బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలతో కలిసి ప్రత్యేక ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసింది. బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపిన 35 లక్షల సంస్థలపై కూడా చర్యలు తీసుకున్నది. అలాగే ఇప్పటి వరకు 3.08 లక్షల సిమ్‌లను బ్లాక్ చేసిన కేంద్రం..500 మందిని అరెస్ట్ చేసింది.

వాణిజ్య

# పేటీఎంకు కిరాణా దూరం

### ఇతర మొబైల్ పేమెంట్ యాప్స్‌కు మారిన 42 శాతం స్టోర్లు

### రిజర్వ్ బ్యాంక్ ఆంక్షల ప్రభావం • కిరాణా క్లబ్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గత వారం విధించిన ఆంక్షలు.. పేటీఎం మొబైల్ పేమెంట్ యాప్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో దేశంలోని కిరాణా స్టోర్లలో దాదాపు సగం పేటీఎంకు దూరమయ్యాయి. 42 శాతం కిరాణా వ్యాపారులు పేటీఎంకు బదులుగా ఇతర మొబైల్ పేమెంట్ యాప్స్‌ను వినియోగిస్తున్నట్టు కిరాణా క్లబ్ చేసిన ఓ తాజా సర్వేలో తేలింది. అంతేగాక 68 శాతం కిరాణా వ్యాపారుల్లో పేటీఎంపై నమ్మకం సన్నగిల్లినట్టు కూడా సదరు సర్వే చెప్పింది. 'ఆర్బీఐ ఆంక్షలు తమ లావాదేవీలను ఆటంకపర్చవచ్చని కిరాణా వ్యాపారులు భయపడుతున్నారు. అందుకే ముందు జాగ్రత్తగా ఇతర మొబైల్ పేమెంట్ యాప్స్‌ను వాడుతున్నారు' అని కిరాణా క్లబ్ వ్యవస్థాపక సీఈవో అన్షుల్ గుప్తా అన్నారు. పేటీఎంకు ప్రత్యామ్నాయ పేమెంట్ ఆప్షన్స్ కూడా బాగానే ప్రాచుర్యంలో ఉండటం.. కిరాణా స్టోర్లకు ఇప్పుడు దిగులు లేకుండా పోయిందని చెప్పారు. కాగా, తమ దుకాణాల్లోకి వచ్చే కస్టమర్లను పేటీఎం మినహా మరే ఇతర పేమెంట్ మొబైల్ యాప్‌నైనా వాడండి అంటూ కిరాణా వ్యాపారులు సలహా ఇస్తున్నట్టు కూడా ఇంకొందరు చెప్పుండటం గమనార్హం. ఈ సర్వేలో మొత్తం 5వేల మంది కిరాణా వ్యాపారుల అభిప్రాయాలను కిరాణా క్లబ్ తీసుకున్నది.

### ఫోన్‌పే టాప్

పేటీఎంకు బదులుగా చాలామంది ఫోన్‌పేను సూచిస్తున్నట్టు సర్వేలో స్పష్టమైంది. 50 శాతం రిటైలర్లు ఫోన్‌పే ద్వారా చెల్లింపులను చేయాలని తమ కస్టమర్లను కోరుతున్నారు. అలాగే 30 శాతం మంది వ్యాపారులు గూగుల్ పేను వినియోగిస్తుండగా, 10 శాతం మంది భారత్‌పేను వాడుతున్నారు. నిజానికి ఒకప్పుడు మొబైల్ పేమెంట్ యాప్స్‌లో పేటీఎం మాత్రమే టాప్‌లో ఉండేదన్న సంగతి విదితమే. ఆ తర్వాత ఫోన్‌పే, గూగుల్ పే నుంచి గట్టి పోటీ ఎదురైంది. ఈ క్రమంలో ఇప్పుడు ఆర్బీఐ ఆంక్షలు.. కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. ఈ నెల 29 తర్వాత పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌లోని ఖాతాలు, ప్రీ-పెయిడ్ సాధనాలు, ఈ-వ్యాలెట్లలో కస్టమర్లు డిపాజిట్లను చేయరాదని, బ్యాంక్ కూడా వాటిని అంగీకరించరాదని జనవరి 31న ఆర్బీఐ ఆంక్షలు పెట్టిన విషయం తెలిసిందే. అయితే వ్యాలెట్లలో ఉన్న నగదును అయిపోయేదాకా వాడుకోవచ్చు. ఇక ఇప్పటికే కొత్త కస్టమర్లను చేర్చుకోవడంపైనా బ్యాంక్‌పై ఆంక్షలుండగా, తాజా పరిమితులతో దాదాపుగా సంస్థ సేవలు నిలిచిపోయినట్టే అవుతున్నది. నిబంధనల అమలులో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ చెప్తున్నారు.

### ఇక పై ప్లాట్‌ఫామ్స్

తమ ఈ-కామర్స్ విభాగం పేరును పై ప్లాట్‌ఫామ్స్‌గా మార్చింది పేటీఎం. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌వోసీ) వివరాల ప్రకారం తెలుస్తున్నది. కొద్ది నెలల క్రితమే ఈ పేరు మార్పు కోసం పేటీఎం విజ్ఞప్తి చేసినట్టు కూడా తెలుస్తున్నది.

### బిట్సీలాను కొన్లేదు

ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) సెల్లర్.. ఇన్నోబిట్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (బిట్సీలా)ను కొన్నారన్న వార్తలను పేటీఎం ఖండించింది. ఈ వార్తలు పూర్తిగా అసత్యమని, తప్పుదోవ పట్టించేవిగా శుక్రవారం ఓ ప్రకటనలో పేటీఎం అధికార ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు.

### ఈపీఎఫ్‌వో క్లెయిమ్‌లు..

ఆర్బీఐ ఆంక్షల నేపథ్యంలో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన క్లెయిమ్‌లను ఈ నెల 23 నుంచి ఆపేస్తామని ఈపీఎఫ్‌వో ప్రకటించింది. దీని వల్ల సదరు ఖాతాదారులకు ఇబ్బందులు తప్పేలా లేవు. క్లెయిమ్‌లు ఆలస్యమవడం, ఖాతాల్లో జమవడం, విత్‌డ్రాయల్ సమస్యగా తయారవనున్నది మరి. గత ఏడాది ఎయిర్‌టెల్, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఖాతాల్లో ఈపీఎఫ్ పేమెంట్స్‌కు ఈపీఎఫ్‌వో అంగీకరించిన విషయం తెలిసిందే.

### డైరెక్టర్లు గుడ్‌బై

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ బోర్డుకు శింజిని కుమార్, మంజూ అగర్వాల్ గుడ్‌బై చెప్పారు. కుమార్ బ్యాంక్ ఆఫ్ అమెరికా, పీడబ్ల్యూసీ మాజీ ఉద్యోగి. ఇక అగర్వాల్ ఎన్పీఐ మాజీ ఎండీ. ఆర్బీఐ ఆంక్షల నేపథ్యంలో వీరిరువురి రాజీనామా ప్రాధాన్యతను సంతరించుకోగా, ప్రస్తుత పరిణామాలన్నీ పేటీఎంను మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి.

### 14న హైసియా సదస్సు

#### ప్రారంభించనున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 9: హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్(హైసియా) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా జాతీయ సమ్మిట్ జరగబోతున్నది. ఈ నెల 14న హైటెక్స్ వేదికగా జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించనున్నారు. 31వ సారి జరుగుతున్న ఈ సదస్సులో ఐటీ ప్రొడక్స్ ఎక్స్‌పో, వార్షిక ఇండస్ట్రీ అవార్డులు కూడా అందిస్తున్నట్లు హైసియా ప్రెసిడెంట్ మనీషా సాబూ తెలిపారు. అలాగే ఐటీ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టెక్ మహీంద్రా సీఈవో, ఎండీ సీపీ గుర్నానీ, టీసీఎస్ ప్రెసిడెంట్ వీ రాజన్నలు హాజరవుతున్నారు.

# పీఎఫ్ వడ్డీరేటు ఈసారి 8 శాతమే!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) కేంద్ర ట్రస్టీల బోర్డు (సీబీటీ) ఈ ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సొమ్ముపై వడ్డీరేటును 8 శాతంగానే నిర్ణయించవచ్చన్న అంచనాలున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2022-23) ఇది 8.15 శాతంగా ఉంటే, అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2021-22) 8.10 శాతంగానే ఉన్నది. అయితే ఈసారి ఇంకా తగ్గి 8 శాతానికే పరిమితం కావచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. మరోవైపు ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలున్నందున వడ్డీరేటును యథాతథంగా ఉంచేందుకే కేంద్ర ప్రభుత్వం మొగ్గుచూపుతుందన్న అభిప్రాయాన్నీ ఓ ఈపీఎఫ్‌వో బోర్డు సభ్యుడు వెలిబుచ్చారు. దీంతో శనివారం జరిగే 235వ సీబీటీ సమావేశంలో ఏం నిర్ణయిస్తారన్నది ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఇదిలా వుంటే స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పెంచేందుకు బోర్డు నుంచి ఈపీఎఫ్‌వో అనుమతుల్ని కోరే వీలు కూడా ఉన్నది. ప్రస్తుతం 10 శాతంగా ఉన్న పెట్టుబడుల పరిమితిని 15 శాతానికి పెంచాలన్నది ఈపీఎఫ్‌వో యోచన. దీనివల్ల పీఎఫ్ సొమ్ముపై మరింత రాబడులు అందుకోవచ్చంటున్నది. దీనిపై ట్రస్టీలు ఎలా స్పందిస్తారో చూడాల్సిందే. ఈపీఎఫ్‌వోలో 6 కోట్లకుపైగా సభ్యులున్నారు. సీబీటీ సిఫార్సు చేసిన వడ్డీరేటును కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదించి తుది ప్రకటనను విడుదల చేస్తుంది.

### పెరిగిన విదేశీ నిల్వలు

ముంబై, ఫిబ్రవరి 9: విదేశీ మారకం నిల్వలు మరింత పెరిగాయి. ఈ నెల 2తో ముగిసిన వారాంతం నాటికి ఫారెక్స్ రిజ